## పోలీస్ తనిఖీల్లో రూ.1.14లక్షలు సీజ్

శాయంపేట, అక్టోబర్ 17: అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని మాందారిపేట స్టేజీ వద్ద జాతీయరహదారిపై సోమవారం రాత్రి ఎస్సై దామెరుప్పుల దేవేందర్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. దీంతో రాత్రి 10గంటల ప్రాంతంలో పరకాల నుంచి హనుమకొండ వైపు వెళ్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా రూ.1.14లక్షలు పట్టుకున్నట్లు తెలిపారు. జెమిని టీ డిస్ట్రిబ్యూటర్ ఎండీ.రాజాబెల్లి వద్ద రూ.1.14లక్షల నగదు దొరకగా స్వాధీనం చేసుకుని, సంబంధించిన పత్రాలను పరిశీలించి ఫ్లయింగ్ స్క్వాడ్ బృందానికి అప్పగించినట్లు పేర్కొన్నారు.



తనిఖీల్లో నగదును పట్టుకున్న ఎస్సై దేవేందర్

## స్టేషన్ ఘన్‌పూర్‌లో 17.5కిలోల గంజాయి పట్టివేత

స్టేషన్ ఘన్‌పూర్, ఆక్టోబర్ 17: స్టేషన్ ఘన్‌పూర్ రైల్వేస్టేషన్‌లో పోలీసులు గంజాయి పట్టుకున్నారు. మంగళవారం సాయంత్రం తిరుపతి నుంచి హైదరాబాద్ నుంచి వెళ్తున్న కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి గుర్తుతెలియని వ్యక్తి పెద్ద సూట్‌కేస్‌తో దిగాడు. రైల్వేస్టేషన్ ముందు అనుమానాస్పదంగా సుమారు 28 ఏండ్ల యువకుడు కనిపించగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చేరుకుని అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద సూట్‌కేస్‌ను తెరిచి చూడగా నాలుగు గంజాయిని ప్యాకెట్లు కనిపించాయి. వాటిని తూకం వేయగా 17.5 కిలోలు ఉన్నాయి. గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు.

## మార్కెట్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కాశీబుగ్గ, అక్టోబర్ 17: కాటన్ సీజన్ ప్రారంభమైన దృష్ట్యా రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని మార్కెట్ కమిటీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని జేడీఎం ఎన్నారపు మల్లేశం సూచించారు. లక్ష్మీపురంలోని జేడీఎం కార్యాలయంలో వరంగల్ జిల్లా మార్కెట్ కమిటీల డీఎంవోలు, కార్యదర్శుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని మార్కెట్లలో ముందస్తు చర్యల్లో భాగంగా మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పత్తి కొనుగోలు చేసేందుకు సీసీఐ రంగంలోకి దిగితే రైతులకు ఇబ్బందులు కలుగకుండా మార్కెట్‌లో క్రయవిక్రయాలు సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైన పనిముట్లకు వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. పత్తి నాణ్యతను వెంటవెంటనే గుర్తించి, అవసరాన్ని బట్టి రైతులకు తగిన సూచనలు చేయాలన్నారు. అలాగే, యార్డుల్లో రైతులకు కావాల్సిన సదుపాయాలు సమకూర్చాలని డీఎంవోలు, కార్యదర్శులను ఆయన ఆదేశించారు. సమావేశంలో డీడీఎం అజ్మీరా రాజునాయక్, వరంగల్ మార్కెట్ సెక్రటరీ బరుపాటి వెంకటేశ్‌రాహుల్, వరంగల్ డీఎంవో పాలకుర్తి ప్రసాద్‌రావు, జనగామ డీఎంవో బి.నరేంద్ర, మహబూబాబాద్ డీఎంవో వెంకట్‌రెడ్డి, ములుగు డీఎంవో సుచిత్ర, కందగట్ల రామకృష్ణ, కార్యదర్శులు జన్ను భాస్కర్, లా షరీఫ్, చక్రబహదూర్, కృష్ణమీనన్, రమేశ్ పాల్గొనన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేడీఎం మల్లేశం

## ఆన్‌లైన్‌లో చెల్లింపులపై అవగాహన కల్పించాలి

హనుమకొండ సబర్బన్, అక్టోబర్ 17: విద్యుత్ వినియోగదారులు ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లించడంపై అవగాహన కల్పించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు అధికారులకు సూచించారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్ భవన్ కార్యాలయంలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ఎస్ఈలు, డీఈలు, ఎస్ఏవోలతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కలెక్షన్ సెంటర్లకు వచ్చే వినియోగదారులకు ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. డిజిటల్ పేమెంట్స్‌తో సమయాన్ని ఆదా చేసుకోవాలన్నారు. టీఎస్ఎన్పీడీసీఎల్ పరిధిలోని 17జిల్లాల వినియోగదారులు ఆన్లైన్ ద్వారా బిల్లు చెల్లించేందుకు అధికారులు సూచనలు, సలహాలు అందించాలన్నారు. మీటర్ రీడింగ్ చెక్ చేయాలన్నారు. వర్క్ ఆర్డర్ పూర్తి చేయాలని, రాని బకాయిలను వసూళ్లు చేయాలని సూచించారు. బిల్ స్టాప్, డిస్ కనెక్షన్ ఉన్న సర్వీసులను తనిఖీలు చేయాలని, ట్రాన్స్‌ఫార్మర్‌ల వైఫల్యాలు తగ్గించాలని అన్నారు. డైరెక్టర్లు బీ వెంకటేశ్వరరావు, పీ గణపతి, పీ సంధ్యారాణి, పీ మోహన్‌రెడ్డి, వీ తిరుపతిరెడ్డి, సీజీఎంలు బీ అశోక్‌కుమార్, టీ మధుసూదన్, రాజుచౌహాన్, భీకంసింగ్, ఎస్ఈ నిజామాబాద్ రవీందర్, ఎస్ఈ కామారెడ్డి రమేశ్, డీఈలు, ఎస్ఏవోలు, డీఈటీ అనిల్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో టీడీపీ దుకాణం

- హస్తం పార్టీ సీనియర్లు పక్కకు
- ఒక్కొక్కరిని పక్కనబెడుతున్న పొరుగు నాయకత్వం
- ఎక్కువ స్థానాల్లో టీడీపీ మాజీలకే టిక్కెట్
- భగ్గుమంటున్న కాంగ్రెస్ నేతలు, శ్రేణులు

వరంగల్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీలో అయోమయం ఇంకా పెరుగుతున్నది. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లోనూ ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి వరుసగా టిక్కెట్లు ఖరారవుతున్నట్లు ప్రచారం జరుగుతున్నది. దీంతో ఇన్నేండ్లు పార్టీ కోసం పనిచేసిన వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ నుంచి వచ్చి పీసీసీ అధ్యక్షుడైన రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్‌లో మొదటి నుంచి ఉంటున్న నేతలకు అవకాశాల పరంగా అన్యాయం జరుగుతున్నది. రాష్ట్ర స్థాయిలోనే కాకుండా అన్ని జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని అన్ని సెగ్మెంట్లలో టీడీపీ నుంచి వచ్చిన వారికే టిక్కెట్ దక్కేలా రేవంత్‌రెడ్డి కుట్రలు చేస్తున్నారని కాంగ్రెస్‌లోని సీనియర్ నేతలు చెబుతున్నారు. టీడీపీ పాత దోస్తులు లేని చోట్ల ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి రేవంత్‌రెడ్డి అండదండలు ఉంటున్నాయని అంటున్నారు. ఏ రకంగా అయినా కాంగ్రెస్‌లో మొదటి నుంచి ఉంటున్న వారికి టిక్కెట్ రాకుండా చేయడమే లక్ష్యంగా రేవంత్‌రెడ్డి చక్రం తిప్పుతున్నారని పేర్కొంటున్నారు. తాజాగా టీడీపీ మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరుతున్నారు. పరకాల నుంచి పోటీ చేస్తానని ప్రకాశ్‌రెడ్డి ప్రకటించారు. నర్సంపేట నుంచి మూడుసార్లు గెలిచిన ప్రకాశ్‌రెడ్డి టీడీపీ నుంచి బీజేపీలో చేరారు. ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరుతున్నారు. కొత్తగా చేరుతున్న ప్రకాశ్‌రెడ్డికి పరకాల నుంచి పోటీ చేసే అవకాశం ఇస్తుండడంపై కాంగ్రెస్‌లో ఆందోళన మొదలైంది. గత రెండు ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన నాయకులు ఈ పరిణామాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2014లో పరకాల నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఇనుగాల వెంకట్రామిరెడ్డి పోటీచేశారు. 2018 ఎన్నికల్లో కొండా సురేఖ పోటీలో ఉన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో వెంకట్రామిరెడ్డి, కొండా మురళీధర్‌రావు పరకాల కాంగ్రెస్ టిక్కెట్ ఆశిస్తున్నారు. వీరిద్దరిని కాదని ఇప్పుడు కొత్తగా చేరుతున్న రేవూరికి టిక్కెట్ ఇవ్వడం ఏమిటని కాంగ్రెస్ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. ప్రకాశ్‌రెడ్డికి చాన్స్ ఇస్తే పార్టీకి మూకుమ్మడిగా రాజీనామా చేస్తామని నియోజకవర్గంలోని ద్వితీయశ్రేణి నేతలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ అధిష్టానాన్ని హెచ్చరించారు.

### ఎక్కువ సెగ్మెంట్లలో..

ఉమ్మడి జిల్లాలోని ఎక్కువ సెగ్మెంట్లలో టీడీపీ నుంచి వచ్చిన వారికే కాంగ్రెస్ టిక్కెట్లు దక్కుతున్నాయి. టీడీపీ మాజీ ఎమ్మెల్యే ధనసరి అనసూయ కాంగ్రెస్‌లో చేరగానే అక్కడి స్థానిక నేత పోదెం వీరయ్యను భద్రాచలం నియోజకవర్గానికి పంపారు. గత ఎన్నికల్లో, ఇప్పుడు అనసూయకు ములుగు టిక్కెట్ ఇచ్చారు. మరో టీడీపీ మాజీ నేత గండ్ర సత్యనారాయణరెడ్డిని భూపాలపల్లి అభ్యర్థిగా కాంగ్రెస్ ప్రకటించింది. డోర్నకల్‌లోనూ గత ఎన్నికల్లో జాటోత్ రాంచంద్రునాయక్‌కు టిక్కెట్ ఇచ్చారు. ఇప్పుడు మళ్లీ ఆయన టిక్కెట్ ఆశిస్తున్నారు. పలు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ సీనియర్ నేతలను కాదని ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికే టిక్కెట్లు ఇచ్చేలా పీసీసీ నాయకత్వం నిర్ణయాలు తీసుకుంటున్నదని హస్తం పార్టీ శ్రేణులు చెబుతున్నారు. జనగామ సెగ్మెంట్‌లో పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్యను కాదని, బీజేపీ నుంచి వచ్చిన కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి టిక్కెట్ ఇచ్చేలా పీసీసీ నాయకత్వం నిర్ణయం తీసుకుంటున్నదని తెలిసింది. నాలుగున్నర దశాబ్దాలపాటు కాంగ్రెస్‌లో కొనసాగిన పొన్నాల ప్రస్తుత నాయకులు చేస్తున్న అవమానాలను తట్టుకోలేక ఆ పార్టీని వీడారు. పాలకుర్తి, వర్ధన్నపేట సెగ్మెంట్లోనూ కాంగ్రెస్ సీనియర్ నేతలను కాదని కొత్తగా చేరుతున్న వారికి పోటీ చేసే అవకాశం ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. దీంతో ఈ సెగ్మెంట్లలో టిక్కెట్ ఆశిస్తున్న పాత నేతలు, కాంగ్రెస్ కేడర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



సమావేశంలో పాల్గొన్న పరకాల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, సర్పంచ్‌లు, నాయకులు

## పరకాల టికెట్ ఇవ్వకుంటే మూకుమ్మడిగా రాజీనామా చేస్తాం

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, సర్పంచ్‌లు**

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 17: కాంగ్రెస్ పార్టీ పరకాల నియోజకవర్గ టికెట్ ఇనుగాల వెంకట్రామిరెడ్డికి ఇవ్వకుంటే పార్టీకి మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తామని ఆ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు అధిష్టానానికి అల్టిమేటం జారీ చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, డివిజన్ల అధ్యక్షులు, ఎంపీటీసీలు, సర్పంచులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న కార్యకర్తలు, నాయకులకు అన్యాయం చేయొద్దని, పరకాల టికెట్ కోసం ఇప్పుడు కొత్త పేర్లు పరిశీలించడం సరికాదని, కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీని కాపాడి, కార్యకర్తలకు అండగా ఉన్న నాయకుడికి టికెట్ ఇవ్వాలని పీసీసీ అధ్యక్షుడిని కోరారు. పరకాల బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు బీరం రజినీకర్‌రెడ్డి (ఎంపీటీసీ గూడెప్పహాడ్), ఆత్మకూరు ప్యాక్స్ చైర్మన్ రవీందర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ ఆత్మకూరు, దామెర, సంగెం, గీసుగొండ, నడికూడ మండలాల అధ్యక్షులు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

# పాలకుర్తి పట్టణంలో భ్రూణహత్య

- ఆడ శిశువని చెప్పిన స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు
- అబార్షన్ చేసిన ఆర్ఎంపీ
- బయటపడిన మృత మగశిశువు
- తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి



పాలకుర్తిలో అబార్షన్ చేయించుకున్న బాలింతను విచారిస్తున్న వైద్య సిబ్బంది

పాలకుర్తి రూరల్, అక్టోబర్ 17 : స్కానింగ్ సెంటర్ నిర్వాహకుల తప్పిదం ఆ తల్లిదండ్రులకు శోకాన్ని మిగిల్చింది. ఆడ శిశువని చెప్పడంతో గర్భిణికి పాలకుర్తిలో ఓ ఆర్ఎంపీ అబార్షన్ చేసి మృత మగ శిశువును బయటకు తీయగా భ్రూణహత్య వెలుగుచూసింది. పాలకుర్తి పట్టణానికి చెందిన ఆర్ఎంపీ గుగులోత్ రాములు, భార్య క్రాంతి కొన్నేళ్లుగా అబార్షన్లు చేస్తున్నట్లు ప్రచారంలో ఉంది. మండలంలోని దుబ్బతండా బీ గ్రామానికి చెందిన ఓ గిరిజన మహిళకు ఇద్దరు ఇద్దరు కూతుళ్లు. ఆతర్వాత గర్భం దాల్చగా జనగామ, హనుమకొండలోని స్కానింగ్ సెంటర్లలో చూపించుకుంది. ఆడ శిశువు అని స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు చెప్పడంతో పాలకుర్తిలో ఆర్ఎంపీ రాములు వద్ద సోమవారం రాత్రి అబార్షన్ చేయించుకుంది. అబార్షన్ తర్వాత మృత మగ శిశువు బయటపడడంతో కుటుంబ సభ్యులు, బంధువులకు శోకం మిగిలింది. విషయం తెలుసుకున్న జిల్లా వైద్యాధికారి ప్రశాంత్‌కుమార్ మంగళవారం వైద్య సిబ్బందితో సదరు ఆర్ఎంపీ పాలకుర్తిలోని క్లినిక్‌ను తనిఖీ చేశారు. ఆ సమయంలో ఆర్ఎంపీ లేకపోవడంతో అతడి భార్య సోమవారం రాత్రి అబార్షన్ చేయగా మగ శిశువని తేలిందని పేర్కొంది. ఎలాంటి అనుమతి లేకుండా అబార్షన్ చేయడంపై జిల్లా వైద్యాధికారి ఆగ్రహించారు. ఆయన్ను వివరణ కోరగా పాలకుర్తి పట్టణంలోని ఆర్ఎంపీ ఓ గిరిజన మహిళకు అబార్షన్ చేసి మృత మగ శిశువును బయటకు తీసిన విషయంపై విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని తెలిపారు. ఆర్ఎంపీ పీఎంపీలు ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలని సూచించారు. ఆబార్షన్లతో పాటు అనుమతి లేని వైద్యం చేయరాదని సూచించారు. అనుమతులు లేకుండా వైద్యం చేస్తే క్లినిక్‌లను సీజ్ చేస్తామని హెచ్చరించారు.